క్లుప్తంగా

కౌంటింగ్ సరళి పరిశీలన



ములుగు : మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ములుగు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాతో కలిసి మంగళవారం పరిశీలించారు. ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన అధికారులకు కౌంటింగ్ ప్రక్రియపై తగిన సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన అనంతరం అధికారులు ఈవీఎం బాక్సులను ములుగు జిల్లా కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు

ఏటూరునాగారం: దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చూసేందుకు మండలంలోని ప్రజలు టీవీలకు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోయారు. మంగళవారం ఉదయం 8గంటలకు పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎవరికి ఎంత మెజార్టీ వస్తుందని చూసేందుకు ఆసక్తి చూపారు. అంతేకాకుండా గెలుపోటములపై పోటీపడ్డారు. దీంతో టీవీ షాపులు, హోటళ్లు, సెలూన్ తదితర షాపుల వద్ద ప్రజల సందడి నెలకొంది. ఫలితాల అనంతరం కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా బీఆర్‌ఎస్ పార్టీ గెలవకపోవడంతో ఆ పార్టీ నాయకులు ఇంటికే పరిమితం అయ్యారు.

చెట్టును ఢీకొట్టిన స్కార్పియో



ఎస్ఎస్‌తాడ్వాయి: ఓ స్కార్పియో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున తాడ్వాయి–మేడారం మార్గంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే హైదారాబాద్‌లోని కంగార్‌కాలనీకి చెందిన వారు భద్రాచలం వెళ్లి సీతారాములను దర్శించుకున్నారు. అనంతరం మేడారం సమ్మక్క- సారలమ్మ దర్శనానికి బయలు దేరారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున సుమారుగా 5 గంటల ప్రాంతంలో తాడ్వాయి దాటిన తర్వాత నాలుగు కిలోమీటర్ల దూరంలో స్కార్పియో వాహనం అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో శబరీష్(9) అక్కడికక్కడే మృతి చెందగా మరికొంతమంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయాలపాలైన వారిని తాడ్వాయి పీహెచ్‌సీకి తరలించి వైద్య చికిత్సలు అందించారు. అనంతరం పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. బాలుడు శబరీశ్ మృతితో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

నియామకం

మల్హర్: ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రం తాడిచర్ల గ్రామానికి చెందిన కేసారపు నరేష్ నియమితులయ్యారు. హనుమకొండలో జరిగిన తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భాగంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అ. ధ్యక్షుడు గోవింద నరేష్ మంగళవారం ప్రకటించినట్లు కేసారపు నరేష్ తెలిపారు. తన నియమాకానికి సహకరించిన వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

11న జెడ్పీ సమావేశం

భూపాలపల్లి రూరల్: ఈ నెల 1వ తేదీ ఉదయం 10:30 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ నరేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



ఏటూరునాగారం: సంబురాల్లో పాల్గొన్న నాయకులు



వెంకటాపురం(కె)లో..

ఏటూరునాగారం: ఉమ్మడి జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న, చిటమట రఘు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై ఉన్న నమ్మకంతో ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ రుణపడి ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేసే పథకాలను మరింత దరిచేరే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూబ్, గంపల శివ, రంజిత్, వావిలాల ఎల్లయ్య, సర్దార్‌పాషా, గౌస్, ముత్తయ్య, రమేష్, శ్రీను, హన్మంతు, లక్కి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోరిక బలరామ్‌నాయక్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తు మంగళవారం మండల కేంద్రంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చుకున్నారు. కార్యకర్తలు, నాయకులు మిఠాయిలు పంచిపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీలు గార్లపాటి రవి, నాయకులు చిడెం శివ, మన్నెం సునీల్, మద్దుకూరి ప్రసాద్, పిళ్లారి శెట్టి మురళి, ధనపనేని నాగరాజు, తదితరులు ఉన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించాలి



మాట్లాడుతున్న జడ్జి సూర్య చంద్రకళ

ములుగు: 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పోలీస్ అధికారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల చైర్మన్ ఎస్‌వీపీ సూర్య చంద్రకళ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి పోలీసులతో మంగళవారం ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన కక్షిదారులకు ఇబ్బందులు కలుగకుండా రాజీమార్గం ద్వారా వారి కేసులను పరిష్కరించడానికి సహకరించాల న్నారు. లోక్ అదాలత్‌పై న్యాయ సలహాలు, సూచనలకు న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించా లన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్య లాల్, ఎస్పీ శబరీశ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నగదు అందజేత



నగదు అందజేస్తున్న లిల్లేష్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం హనుమాన్ నగర్‌లోని శ్రీవీరాంజనేస్వామి ఆలయ అభివృద్ధి పనులకు కాటారంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గుండేటి లిల్లేష్ రూ.50వేలను విరాళంగా ఆలయ అర్చకుడు మాడుగుల బాపుశర్మకు మంగళవారం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 105 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 32 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా ప్రవీణ్



భూపాలపల్లి రూరల్: తెలంగాణ మున్నూరుకాపు సంఘం భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నాయిని ప్రవీణ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి ప్రదాతకు పట్టం కట్టిన ఓటర్లు



బలరాంనాయక్‌తో సోమయ్య

మంగపేట: కాంగ్రెస్ పార్టీ పాలనలో కేంద్ర మంత్రిగా పనిచేసి మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసిన పోరిక బలరాంనాయక్‌ను ప్రజలు తమ ఓటు వేసి పట్టం కట్టారని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలపై మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్‌కు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కమిటీ ఎన్నిక



వాజేడు: మండల ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమిడి ఓంకార్, ఉపాధ్యక్షుడిగా గుగ్గిళ్ల నర్సింహరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల ఇన్‌చార్జ్‌లుగా తలండి రమేష్, చిట్యాల సాగర్ ఎన్నికయ్యారు.

గాలివాన బీభత్సం



పలిమెల: పారుతున్న వర్షపు నీరు



మల్హర్: మల్లారం శివారులోని ఎగిరిపోయిన రేకులు

మల్హర్: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షంతో పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. చిన్నతూండ్ల గ్రామానికి చెందిన నక్క లక్ష్మయ్యకు చెందిన ఇంటిరేకులు విరిగిపోయాయి. మల్లారం శివారులో ఇంటిరేకులు లేచిపోయాయి. గాలివాన దుమారంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పొంగిపొర్లిన వాగులు

పలిమెల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో గ్రామాల్లోకి వరద నీరు చేరింది. ఒ క్కసారి కురిసిన భారీ వర్షంతో వరద నీరు గ్రామాల్లోకి చేరడంతో కాస్త ఇబ్బందులు పడ్డారు.

పేదలకు పసుపు పంపిణీ



పసుపు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

వాజేడు: మండలంలోని ఘణపురంలో మంగళవారం పేద కుటుంబాల వారికి కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పసుపు పంపిణీ చేశారు. కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆదేశాల మేరకు 65 కుటుంబాల వారికి ఒక్కొక్కరికీ కేజీ చొప్పున పసుపును అందజేశారు. పసుపు అందించిన వారిలో మండల కోఆర్డినేటర్ కామేష్, యానిమేటర్ రమాదేవి, వెమ్కటాపురం(కె) కోఆర్డినేటర్ హనుమంతు ఉన్నారు.

డాక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని పోస్టల్‌శాఖ నుంచి ఫిర్యాదులు ఉంటే ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే డాక్ అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు జిల్లా పోస్టల్ అధికారి మంగళవారం ప్రకటనలో ఒక పేర్కొన్నారు. ఫిర్యాదులు చేయాల్సిన వారు పోస్టు కవర్‌లో శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్) పోస్టు మాస్టర్ జనరల్, హైదరాబాద్, రీజియన్ హైదరాబాద్ 500001 అడ్రస్‌కు పంపించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న అప్పయ్య

వాజేడు: వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు క్రమం తప్పకుండా గ్రామంలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని తెలిపారు. అంతకు ముందు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించడంతో పాటు మందుల నిల్వలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మహేందర్, మధుకర్, తరుణ్, సూర్య ప్రకాష్, రమణ, కోటిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న యేసు బంధువులు

వాజేడు : మావోయిస్టులకు వ్యతిరేకంగా మండల పరిధిలోని జగన్నాథపురం జాతీయ రహదారిపై మంగళవారం స్థానికులు ర్యాలీ నిర్వహించారు. కాగా అదే గ్రామానికి చెందిన ఇల్లెందుల యేసు (55) కొంగాల గ్రామ సమీపంలోని గుట్టపై సోమవారం మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో మృతి చెందిన విషయం విదితమే. యేసు మృతికి మందుపాతరే కారణమని అతని బంధువులు ఫ్లెక్సీతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలను చేస్తూ, మందుపాతర మూలంగా అమాయకుడు బలయ్యాడని దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. యేసు కుటుంబాన్ని ఆదుకునే వారెవరని అమాయకు ప్రాణాలను బలిగొనడమే మావోయిస్టుల పనా అంటూ నినాదించారు. యేసు మృతికి కారకులైన వారిని గుర్తించి వెంటనే శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు యేసు మృతికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫలితాల కోసం ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు



ఫలితాలను వీక్షిస్తున్న ప్రజలు

భూపాలపల్లి రూరల్: పార్లమెంటు ఎన్నికల ఫలితాలను వీక్షించడానికి కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు మంగళవారం జిల్లాకేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. అధికారులు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయడంపై భూపాలపల్లి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. టెంట్లు, కుర్చీలు, తాగునీరు, అత్యవసర మెడిసిన్ అందుబాటులో ఉంచినట్లు డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాస్ తెలిపారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి



మల్హర్‌రావు (ఫైల్)



పద్మ మృతదేహం

మల్హర్/పలిమెల: జిల్లాలో మంగళవారం వేర్వేరు చోట్ల పిడుగుపాటుతో ఇద్దరు చనిపోయారు. మల్హర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన మల్హర్‌రావు (52) అనే రైతు సాయంత్రం సమయంలో మానేరు శివారులోని తన ఆయిల్‌పామ్‌ను పరిశీలించడానికి వెళ్లారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. అతనికి సమీపంలో భారీ శబ్దంతో పిడుగుపడడంతో మల్హర్‌రావు అక్కడికక్కడే మృతిచెందాడు. మల్హర్‌రావుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పలిమెల మండలం నీలంపల్లి గ్రామానికి చెందిన వాసం పద్మ (45) గోదావరి నదికి వెళ్లిన క్రమంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం మొదలైంది. దీంతో భారీ శబ్దంతో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలి భర్త గతంలో మరణించారు. ఆమె ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

కాటారం: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన ఘటన కాటారం మండలం శంకరాంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మడిపల్లి లక్ష్మి(50) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందినప్పటికీ కడుపునొప్పి తగ్గ లేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత వైద్యం చేయించుకునే స్థోమత లేక లక్ష్మి కాలం వెల్లదీస్తూ వచ్చింది. ఇదే క్రమంలో కడుపు నొప్పి తీవ్రం కావడంతో సోమవారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతం వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం లక్ష్మి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త నర్సయ్య, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

విద్యుత్ సమస్యలపై సంప్రదించండి

భూపాలపల్లి రూరల్: జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారి సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి డీఈ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల కోసం ప్రత్యేకంగా ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డీఈ తెలిపారు.

మండలం	ఎఫ్‌ఓసీ నంబర్	ఏఈ నంబర్
భూపాలపల్లి టౌన్	9491075022	9440811322
భూపాలపల్లి రూరల్	7901097177	7901092684
గణపురం	8985185182	9440814858
రేగొండ	9491075027	9440814863
చిట్యాల	9491075023	9440814865
మొగుళ్లపల్లి	7382633920	9440814864
టేకుమట్ల	8331011371	9440908200
కాటారం	9491075225	9440811495
మల్హర్	9491075227	9440811493
మహదేవ్‌పూర్	9491075229	9440811496
మహాముత్తారం	8333923831	7901678238
పలిమెల	7013883270	7901678237

ప్రమాదకరంగా రహదారి



జూకల్ పాత టాకీస్ వద్ద దెబ్బతిన్న రోడ్డు



తిర్మలాపూర్ వద్ద..

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని జూకల్ శివారు పాత టాకీస్ వద్ద తారు రోడ్డు అధ్వానంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డు వెంట వెళ్తుంటాయి. రెండు వాహనాలు ఎదురేదురుగా వస్తే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో చిట్యాల నుంచి రేగొండ వరకు రూ.లక్షలాది వెచ్చించి ఈ రోడ్డుకు అధికారుల పర్యవేక్షణలో, కాంట్రాక్టర్లు మరమ్మతులు చేశారు. కానీ తిర్మలాపూర్, చిటాల్యాల, చల్లగరిగ గ్రామాల మధ్యలో అక్కడక్కడ కొంత మేరకు నామామంత్రంగానే మరమ్మతు చేశారు. కొన్ని ప్రదేశాల్లో అట్లాగే వదివేశారు. దీంతో వాహనాదారులు స్పీడ్‌గా వచ్చి రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

కొత్తపల్లిగోరిలో షూటింగ్ సందడి



షూటింగ్‌లో పాల్గొన్న ఆర్టిస్టులు

రేగొండ(కొత్తపల్లి గోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో ప్రైవేట్ ఆల్బమ్ షూటింగ్ సాగడంతో గ్రామంలో సందడి నెలకొంది. మంగళవారం గ్రామానికి చెందిన ఆవుల పవన్ ఆధ్వర్యంలో గ్రామంలో సెట్ వేసి పాటను షూట్ చేశారు. స్థానికులంతా గ్రామంలో చిత్రికరించిన సన్నివేశాలను ఆసక్తిగా తిలకించారు.